క్లుప్తంగా

వరద బాధితులకు వితరణ



వరద బాధితుల కోసం నిత్యావసర సరుకులను ఏర్పాటుచేసిన మానవత శాఖ

కొయ్యలగూడెం: వేలూరుపాడు మండలం వాడపల్లి, చిగురుమామిడి, తూర్పుమెట్ట, పరిసర గ్రామాల్లోని 500 మందికి పైగా వరద బాధిత కుటుంబాలకు మంగళవారం సుమారు 25 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు, ఆహార సామగ్రి అందజేశామని మానవత కొయ్యలగూడెం మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు బొమ్మ మోహన్, తిర్నాతి సిద్ధార్థలు తెలిపారు. కార్యక్రమంలో దిద్దే అబినేజర్, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, వీఎస్ఎన్ స్వామి, తిగిరిపల్లి చంటి, భవిరిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దేవస్థానం ఏఈఓగా వాసు



పదోన్నతి పత్రాన్ని వాసుకి అందిస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పరిపాలనా విభాగం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మెట్లపల్లి శేష లక్ష్మి శ్రీనివాస్ (వాసు) ఏఈఓగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తన చాంబర్‌లో వాసుకి పదోన్నతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఇటీవల ఆలయ ఏఈఓ కేఎల్ఎన్ రాజు పదవీ విరమణ పొందడంతో, ఆయన స్థానంలో వాసుకి చోటు దక్కింది. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ పదోన్నతి తన బాధ్యతను మరింతగా పెంచిందని చెప్పారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ త్రినాథరావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉంటే ఆలయ ఉద్యోగులు, పలువురు స్థానికులు వాసుకి శుభాకాంక్షలు తెలియజేశారు.

వృత్తి విద్యా కేంద్రం వార్షికోత్సవం



శిక్షణా కేంద్రంలో సావనీర్ విడుదల చేసిన బిషప్ తదితరులు

లింగపాలెం: రంగాపురంలో మత గురువు కాట్రు యోహాను నెలకొల్పిన సెంట్ జాన్ వృత్తి విద్యా శిక్షణా కేంద్రంలో వివిధ కోర్సులకు సంబంధించి పేద విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. మొదటి వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్‌సీఎం సంస్థల బిషప్ పొలిమేర జయరావు చేతుల మీదుగా 80 మంది పేద విద్యార్థులకు రూ.1 లక్షా 25 వేలు అందజేశారు. ఎంఈఓ కార్యాలయానికి వాటర్ ఫిల్టర్, పోలీస్‌స్టేషన్‌కు కంప్యూటర్‌ను బహూకరించారు. విద్యార్థులకు విద్యాకిట్లను అందించారు. కార్యక్రమంలో ఆస్ట్రియా మత గురువు మార్టిన్, బిషప్, వ్యవస్థాపకుడు కాట్రు యోహాను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామారావు, రవీంద్ర, సంస్థ కరస్పాండెంట్ జాన్‌రాజు ఏఎస్సై రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేసిన వారిపై కేసు నమోదు



తిమ్మాపురంలో రహదారిపై ఆందోళన చేస్తున్న నాయకులు, స్థానికులు

ద్వారకాతిరుమల: కోళ్ల దొంగతనం చేశారన్న అనుమానంతో దళిత యువకుడితో పాటు మరో ఇద్దరిపై దాడి చేసిన అగ్రకులాల వారిని వెంటనే అరెస్టు చేయాలంటూ పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు తిమ్మాపురం సెంటర్‌లో మంగళవారం సాయంత్రం రాస్తారోకో నిర్వహించారు. దీంతో భీమడోలు ద్వారకాతిరుమల మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై టి.సుధీర్ ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు వినకుండా సుమారు గంట పాటు ఆందోళనను కొనసాగించారు. చివరకు పోలీసులు వారిని పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, స్థానికులపై రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై సుధీర్ తెలిపారు. అనుమతులు లేకుండా రోడ్లపై ఆందోళనలు చేస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని ఎస్సై హెచ్చరించారు.

స్ఫూర్తి నింపిన జగనన్న సురక్ష

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణుల్లో స్ఫూర్తి నింపిందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం చొప్పరామన్నగూడెంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు గొడ్డటినాగేశ్వరరావు, సంకు కొండల ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష విజయోత్సవ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విభిన్న పథకాలు వినూత్న సంక్షేమాలతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సాధించిందన్నారు. పోలవరం నియోజకవర్గం ఏడు మండలాల్లో 1 లక్షా 473 ఇళ్ల సర్వే పూర్తి చేయగా జగనన్న సురక్ష పథకం ప్రారంభించిన నాటి నుంచి 23 రోజుల్లో 107 సచివాలయాల పరిధిలో సదస్సులు నిర్వహించామని చెప్పారు. 68,918 మంది దరఖాస్తు చేసుకోగా 66,307 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశామని, ప్రజా సమస్యలను పరిష్కరించామని వివరించారు. ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని, మరోసారి జగనన్న నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రానికి సారథ్యం వహించడం ఖాయమన్నారు. జగనన్న సురక్ష విజయవంతం చేసిన అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



జగనన్న సురక్ష విజయోత్సవ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు



గవరవరంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తాం

కొయ్యలగూడెం: అర్హులందరికీ స్థలాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మించి తీరుతామని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హామీ ఇచ్చారు. మంగళవారం చొప్పరామన్నగూడెం, గవరవరం గ్రామ పంచాయతీల పరిధిలో ఎంపీటీసీ సభ్యులు చిరువూరు కళావతి, బిరుదుగడ్డ రత్నకుమారి ఆధ్వర్యంలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. తమకు పంపిణీ చేసే ఇళ్ల స్థలాలు అర్థాంతరంగా నిలిచిపోయాయని తాడేపల్లిగూడెం హైవేకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాల్లో నివసిస్తోన్న ప్రజలు బాలరాజు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు, ఆయన అనుయాయులు కోర్టుల్ని ఆశ్రయించడం వల్లే పేదవాడి సొంత ఇల్లు కల నెరవేరకుండా పోయిందని బాలరాజు సానుభూతి వ్యక్తం చేశారు. భూములు కొనుగోలు చేసి అయినా నాలుగు నెలల్లో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించి తీరుతామని వారికి హామీ ఇచ్చారు. రెవెన్యూ అధికారుల చర్యల వల్ల జగనన్న భూ సర్వేలో అవకతవకలు చోటుచేసుకున్నాయని మాజీ సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహారాజు ఫిర్యాదు చేయడంతో సమగ్ర దర్యాప్తు చేసి రైతులకు న్యాయం చేస్తామని బాలరాజు బదులిచ్చారు. వలంటీర్ల వ్యవస్థలో ఒకరిద్దరి వల్ల జరిగే చెడుని భూతద్దంలో చూస్తోన్న ప్రతిపక్షాలు ప్రాణాలకు తెగించి కరోనా సమయం మొదలుకొని పెన్షన్ల పంపిణీ వరకు కొనసాగుతున్న వలంటీర్ల సక్సెస్ యాత్రను బయట పెట్టలేకపోతున్నాయని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, ఎంపీటీసీలు గంటా శ్రీను, చిరువూరు కళావతి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, మద్దు గోపి, మారిశెట్టి శ్రీను, దూలపల్లి కాంతారావు, పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు సీమకుర్తి సత్యనారాయణ, నాయకులు తగరం ఆశీర్వాదం, కోనాపూర్ రామ్మోహన్‌రావు, చిరువూరి శ్రీనివాస్, తగరం విజయకుమార్, చిలకంటి రాము, గంటా రమేష్, పసుమర్తి వేణు, కనికినేటి సత్యనారాయణ, బిరుదుగడ్డ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న అంజన్న ఉత్సవ మూర్తి

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానాన్ని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు స్వామి వారికి తమలపాకులతో పూజలు చేశారు. స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.1,27,609 వచ్చిందని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. 800 మంది భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్టు చెప్పారు. రేచర్ల, శెట్టిగూడెంకు చెందిన భజన మండలి సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ధర్మకర్తల మండలి సభ్యులు మల్నీడి బాబి, బల్లే నాగలక్ష్మి, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి

జంగారెడ్డిగూడెం రూరల్: నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబంలో లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు రహదారులు నిర్మించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎలీజా హామీ ఇచ్చారు. తమ స్థలాలు తీసుకుని ఇంటి నుంచి బయటకు పంపించేశారంటూ వృద్ధదంపతులు మాగంటి సుబ్బులు, వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వృద్ధ దంపతుల సమస్యను ఎమ్మెల్యే ఫోన్‌లో ఆర్డీఓ ఝాన్సీరాణికి తెలియజేసి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులను కేటాయిస్తోందని తెలిపారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వం సంక్షేమ పాలన తీసుకొచ్చిందన్నారు. అర్హులందరికీ సొంతింటి కల నెరవేర్చాలనే ధ్యేయంతో స్థలాలు, గృహాలను ప్రభుత్వం మంజూరు చేస్తోందని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీనే విజయదుందుభి మోగించడం ఖాయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ గుబ్బల సత్యవేణి, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, పార్టీ నాయకులు వేముల బాలగురవయ్య, కొయ్య లీలాధరరెడ్డి, దల్లి రామాంజనేయరెడ్డి, యరమాల సత్యవతి, జ్యోతిక, మాజీ సర్పంచ్ బండి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

మణిపూర్ ఘటనలను నిరసిస్తూ దీక్ష



తిమ్మనకుంటలో దీక్ష చేపట్టిన క్రైస్తవులు



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు, విశ్వాసులు

కొయ్యలగూడెం: మణిపూర్‌లో దుర్ఘటనలను నిరసిస్తూ యర్రంపేట పంచాయతీ తిమ్మనకుంట గ్రామ కూడలిలోని మండపం వద్ద క్రైస్తవులు మంగళవారం ఒకరోజు దీక్ష చేశారు. మణిపూర్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల తీరును వ్యతిరేకిస్తూ ఫ్లకార్డులను ప్రదర్శించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాస్టర్ రాజశేఖర్ జీసస్ గాస్పల్ మినిస్ట్రీ సంఘ ఆధ్వర్యంలో తొలుత శాంతి ర్యాలీ నిర్వహించారు. వీరికి ప్రజాప్రతినిధులు, పార్టీలకు అతీతంగా నాయకులు సంఘీభావం ప్రకటించారు.

క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ

కామవరపుకోట: మణిపూర్ క్రైస్తవులు, చర్చిలపై దాడులను నిరసిస్తూ కామవరపుకోట మండలంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక బైబిల్ కాలేజీ నుంచి కొత్తూరు బస్టాండ్, చెక్‌పోస్ట్, దుర్గ మహల్, చౌతనసెంటర్ మీదుగా పాతూరు తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ, అనంతరం తహసీల్దార్ డీవీ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, వారిపై దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, మండల యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.జీవన్‌కుమార్, సెక్రటరీ సుధీర్ డానియల్, కర్మెల్ మినిస్ట్రీ వ్యవస్థాపకుడు దిరిసెన మోజెస్, సీఎస్ఐ పాస్టర్ జాన్రాజ్, బైబిల్ మిషన్ పాస్టర్ రాజు, పలు పెంతుకోస్తు సంఘ పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

శాంతించిన గోదావరి



ముంపు నుంచి బయటపడిన ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రోడ్డు



ముంపులోనే ఉన్న ఎద్దెలవాగు వంతెన

పోలవరం రూరల్ / వేలూరుపాడు : గోదావరి నదికి వరద ఉధృతి తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం వరద ముంపు నుంచి పూర్తిగా బయటపడింది. పోలీసు చెక్‌పోస్టు వద్ద కార్యకలాపాలు, ప్రాజెక్టు ప్రాంతానికి వాహనాల రాకపోకలు కూడా యథావిధిగా కొనసాగుతున్నాయి. నారుమడులు, వరి నాట్లు వేసిన చేలల్లో నీరు కడెమ్మ స్లూయిజ్ ద్వారా నదిలోకి చేరుతోంది. దీంతో పొలాలు వరద నీటి నుంచి తేరుకున్నాయి. వేలేరుపాడు మండలంలోని వంతెనలు నీటి నుంచి బయటపడ్డాయి. ఇళ్లలో నిలిచిన నీరు బయటకు వెళుతోంది. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే దారిలో ఎద్దెలవాగు వంతెన ఇంకా నీటమునిగే ఉంది.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): చింతలపూడి పారిశుద్ధ్య కార్మికులకు అదనంగా ఔట్‌సోర్సింగ్ పోస్టులు మరో 19 కలపాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చింతలపూడిలో 50 మందికిపైగా ఆప్కాస్ కార్మికులుగా తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినా 30 మంది కార్మికులను మాత్రమే విధుల్లోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. మిగతావారిని కూడా విధుల్లోకి తీసుకోలేదని తెలిపారు. దీనిపై విచారణ చేసి మిగిలిన వారినీ విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, నమ్మిన లక్ష్మి, ఉభయగోదావరి జిల్లాల ఇన్‌చార్జి కాశీ కృష్ణ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతో పథకాల వర్తింపు



ఈ పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సుబ్బారావు

టి.నరసాపురం: ఈ-పంట నమోదుపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జీవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రకృతి వైపరిత్యాల సమయంలో బీమా వర్తింపు, మద్దతు ధర, పండించిన పంట అమ్ముకోవడానికి, రైతు భరోసా, ఆర్బీకేల ద్వారా అమలు చేస్తోన్న పథకాల లబ్ధి పొందాలంటే ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-పంట నమోదు వల్ల రైతు ఏ పంట వేశారు, ఎంత విస్తీర్ణంలో వేశారు, ఎంత పెట్టుబడి సాయం కావాలి, ఆయా పంటలకు మద్దతు ధర ఎంత తదితర విషయాలు బేరీజు వేసుకుని రైతులు నష్టపోకుండా ఉంటేందుకు ప్రభుత్వ తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన ఉంటుందని వివరించారు. ప్రతి రైతూ ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు, వీఆర్వోలు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు మేలు



జంగారెడ్డిగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పుట్టిన బిడ్డకు ముర్రు పాలు పట్టించడం ఎంతో ఆరోగ్యదాయకమని ఐసీడీఎస్ సీపీడీఓ పి.బ్యూలా అన్నారు. మంగళవారం జంగారెడ్డిగూడెంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నుంచి నిర్మల హాస్పిటల్ ఏరియా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బ్యూలా మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను తెలియజేసేలా ఆగస్టు 1 నుంచి 7 వరకు వారోత్సావాలు నిర్వహిస్తున్నామన్నారు. ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఉద్యోగులు, వ్యాపారులు చేసే, షాపులలో పని చేసే తల్లులకు బిడ్డకు పాలిచ్చే ప్రదేశాన్ని (మిల్క్ పాయింట్స్) ప్రతిచోటా ఏర్పాటు చేసి ప్రోత్సహించాలని కోరారు. బిడ్డకు ఆరు నెలలు నిండిన వెంటనే అదనపు ఆహారాన్ని అలవాటు చేయాలన్నారు. ర్యాలీలో సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, మంగాదేవి, మేరీ మరియమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో ప్రథమ మహాసభ

జంగారెడ్డిగూడెం: ఏలూరులోని కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జంగారెడ్డిగూడెం గౌరవ అధ్యక్షుడు జీవీ రమణరాజు పిలుపునిచ్చారు. మహాసభల కరపత్రాన్ని మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద వారు విడుదల చేశారు. యూనియన్ జంగారెడ్డిగూడెం కార్యదర్శి కూనపాముల విఘ్నేష్, అధ్యక్షుడు కొత్తూరి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులవి బురద రాజకీయాలు

కుక్కునూరు: ఎమ్మెల్యే టిక్కెట్ కోసం, టీడీపీ అధిష్టానం దృష్టిలో పడేందుకు ఆ పార్టీ నాయకులు వర్గాలుగా విడిపోయి నిర్వాసితులను అడ్డంపెట్టుకొని బురద రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచర్లపాటి నరసింహరాజు ఆరోపించారు. గోదావరి వరదలను రాజకీయం చేస్తూ టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బొరగం శ్రీను, మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరావులు ప్రభుత్వంపై చేసిన విమర్శలపై నరసింహరాజు మంగళవారం కుక్కునూరులో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసే ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టిన విషయాన్ని గుర్తించుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ వచ్చే ఎన్నికల్లో పొత్తులు లేకుండా పోటీచేసి గెలుస్తుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వివరించారు. టీడీపీ మాత్రం ఇప్పటి నుంచే పొత్తుల కోసం పరుగులు పెడుతోందని విమర్శించారు. టీడీపీ హయాంలో ఇచ్చిన పోలవరం భూ పరిహారం అంతా కేంద్రం నుంచి వచ్చిందేనని గుర్తుచేశారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు రావు వినోద్, మాదిరాజు వెంకన్నబాబు, కుచర్లపాటి కృష్ణమరాజు, చిన్న నర్సింహరాజు సర్వ శ్రీహరి, మల్లేలా చంటి నాయుడు, సూర్ల రాము తదితరులు పాల్గొన్నారు.

3న కొబ్బరి రైతుల జిల్లా సమావేశం

ఏలూరు (టూటౌన్): కొబ్బరి రైతుల ఏలూరు జిల్లా సమావేశం ఈనెల 3న ఉదయం 10 గంటలకు ఏలూరు పవరుపేటలోని డాక్టర్ చెన్నకేశవుల రంగారావు వీధిలోని రైతు సంఘం జిల్లా కార్యాలయం హాలులో నిర్వహించనున్నట్టు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నాఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొబ్బరి కాయలకు కనీస ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలని శ్రీనివాస్ కోరారు.

దారయ్య ఎంపిక హర్షణీయం

వేలేరుపాడు: గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా కారం దారయ్య ఎంపిక పట్ల వేలేరుపాడు మండల గిరిజన సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాడిస రాము మాట్లాడారు. ఇటీవల అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన గిరిజన సమాఖ్య 3వ రాష్ట్ర మహాసభలో దారయ్య ఎంపికయినట్టు చెప్పారు. దారయ్య గిరిజన సమైఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ గిరిజనుల సమస్యలపై పోరాడారని తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో పిట్టా ప్రసాద్, పిట్టా వీరయ్య, కరాటం వెంకటేశ్వర్లు, యర్రా మధు, కురిమేళ్ల వెంకటేశ్వర్లు, బంధం నాగేశ్వరరావు, సోడే ప్రసాద్ ఉన్నారు.

నేడు పులిరామన్నగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన పులిరామన్నగూడెంలో బుధవారం ఉదయం 9 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొని ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తారని, వారి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

దశలవారీ ఆందోళన

జంగారెడ్డిగూడెం: నిలిపివేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే దశలవారీ ఆందోళనలో కార్మిక వర్గం పాల్గొనాలని శ్రీ బాలాజీ తాపీ పనివాళ్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మామిడి రాంగోపాల్ కోరారు. జంగారెడ్డిగూడెం ఏరియా శ్రీ బాలాజీ తాపీపనివారల సంక్షేమ సంఘం జనరల్ బాడీ సమావేశం కొప్పుశెట్టి వెంకట సూరిబాబు అధ్యక్షతన మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించారు. రామ్‌గోపాల్ మాట్లాడుతూ ఆందోళనలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు.

యూపీఏ జీలుగుమిల్లి కార్యవర్గం ఎన్నిక

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ (యూపీఏ) జీలుగుమిల్లి మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం జీలుగుమిల్లి మండలం దర్భంగూడెంలో ఎన్నుకొన్నారు. ఈ సమావేశంలో యూపీఏ మండల నూతన అధ్యక్షుడిగా బంటుమిల్లి సాల్మన్‌రాజు, కార్యదర్శిగా కె.సియోను కుమార్, సహాయ కార్యదర్శిగా వై.శ్యామ్, కోశాధికారిగా ఎల్ జాన్‌మోషే, సలహాదారులుగా ఎస్.అప్పారావు, మీడియా వింగ్ కోఆర్డినేటర్‌గా మర్రి జాన్ మోషే ఎన్నికయ్యారు. వీరితో తెలుగు రాష్ట్రాల మోస్ట్ రెవరెండ్ బిషప్ వెలుగు జాకబ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

శ్రీవారి పథకాలకు 945 డాలర్ల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలోని పలు పథకాలకు అమెరికాకు చెందిన అంగర స్వాతి (ఎన్ఆర్ఐ) 945 డాలర్లను చెక్కు రూపంలో పోస్టు ద్వారా మంగళవారం అందజేశారు. అన్నదానానికి 315 డాలర్లు, గోసంరక్షణకు 315 డాలర్లు, ఆగమ పాఠశాల విద్యార్థి దత్తతకు 315 డాలర్లు పంపారని, ఈ డాలర్ల విలువ భారతదేశ కరెన్సీ ప్రకారం రూ.77,777ని ఆలయ అధికారులు తెలిపారు.

ఎస్ఈబీ దాడులు

చింతలపూడి: చింతలపూడి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం, కామవరపుకోట మండలం కొత్తూరు గ్రామాల్లో సోమవారం దాడులు నిర్వహించారు. నాగిరెడ్డిగూడెంలో భూక్యా రమేష్, వడిత్యా సరోజినిలను అరెస్టు చేసి, 15 లీటర్ల నాటు సారా, ఒక మోటార్ సైకిల్‌ను సీజ్ చేశామని సీఐ సుంకర సాయి స్వరూప్ తెలిపారు. 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. కొత్తూరులో ఒక మహిళను అరెస్టు చేసి, 5 లీటర్ల నాటు సారాను సీజ్ చేశామని తెలిపారు.

పథకాల నమోదులో నిర్లక్ష్యం వద్దు

పోలవరం రూరల్: సంక్షేమ పథకాల నమోదు విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి జి.సంకురయ్య అన్నారు. పోలవరం-1 సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ల పనితీరును పరిశీలించారు. అమ్మఒడి, విద్యాదీవెన పథకాల పెండింగ్ దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎస్సీ బాలికల వసతిగృహాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థుల భోజన వసతులపై ఆరా తీశారు.